క్లుప్తంగా

కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నాం



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

చండూరు : రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ 1104 అని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి ఎన్. వెంకటయ్య అన్నారు. మేడే ఉత్సవాల్లో భాగంగా చండూరులో యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్‌ల వారీగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. టి.శ్రీనివాసులు, రాంబాబు, ఆర్.బాలు నాయక్, బి.ముత్తయ్య, ఎండీ.షరీఫ్ పాష, షబ్బు పాష, ముత్యంరెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రమౌళి, వెంకన్న, సైదులు, కుమార్, గిరి, యాదయ్య, పరమేష్, నర్సింహ, శంకర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బీజేపీలో చేరిక

నార్కట్‌పల్లి: మండలంలోని ఔరవాణి మాజీ సర్పంచ్ రూపని సత్యనారాయణతోపాటు 50 మంది యువకులు బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొగులయ్య, మండల వెంకన్న, పనస ఉపేందర్, గణేశ్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి



మాట్లాడుతున్న ఉద్యోగులు

నాంపల్లి: మండల కేంద్రంలోని ఉద్యోగుల భవనంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. గురువారం స్థానికంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ చౌరస్తాలోగల ఆల్ ఎంప్లాయీస్ భవనంలో అక్రమ కట్టడాలను చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆ భవనం స్థలం కోర్టు పరిధిలో ఉందని తెలిపారు. కోర్టు తీర్పు వచ్చేవరకు కట్టడాలను నిలిపివేయాలన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతు



మద్దతు తెలుపుతున్న చొక్కారావు

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు తెలిపారు. గురువారం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. అనంతరం చొక్కారావు మాట్లాడుతూ తాను 33 సంవత్సరాలపాటు విద్య నేర్పిన విద్యార్థులందరూ ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. ఉపాధ్యాయులు, రిటైర్డు ఉద్యోగులు కూడా బీజేపీ అభ్యర్థికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా.నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో మెగా వైద్యశిబిరం

మాడుగులపల్లి : మండలంలోని పాములపహాడ్ గ్రామంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఇమాన్యుయేల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు రక్త పరీక్ష, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. కంటి చూపు సమస్యలున్న వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు జితేంద్ర, ప్రమోద్, సంధ్యారాణి, మనోజ్ఞ, వికాస్, నిర్వాహకులు జంగా, జయరాజ్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

పెద్ద చెరువును పట్టించుకునే వారేరి ?

- తుప్పుపట్టి ధ్వంసమైన కట్టంగూర్ చెరువు తూము తలుపులు
- మట్టితో పూడుకుపోయిన కాలువ
- కట్టను ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు
- నిర్లక్ష్యం వహిస్తున్న ఐబీ అధికారులు



మట్టితో పూడుకుపోయిన కట్టంగూర్ పెద్దచెరువు తూము



కట్టను కమ్మేసిన కంపచెట్లు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని పెద్ద చెరువు అలుగు పక్కన ఉన్న తూము తలుపులు తుప్పుపట్టి శిథిలావస్థకు చేరి రెండు సంవత్సరాలు అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తూము తలుపులు దెబ్బతినడంతోపాటు అదే ప్రాంతంలో బుంగ పడడంతో నీరంతా వృథాగా పోయి గత సంవత్సరం వానాకాలం, యాసంగి పంట సాగు నిలిచిపోయింది. మత్స్యకారులు గత సంవత్సరం చేపలు కాపాడుకునేందుకు ఉన్న కొద్దిపాటి నీరు బయటకు వెళ్లకుండా చెరువు అలుగు గేటు వద్ద మట్టి పోసి తూమును పూడ్చివేశారు. దీంతో చేపల పెంపకానికే చెరువు ఉపయోగపడింది తప్ప పంట సాగుకు ఉపయోగపడలేదు. చెరువు కింద బోరు మోటార్లు ఉన్న కొద్ది మంది రైతులు మాత్రమే వరి పంటసాగు చేశారు. అధికారులకు పలుసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో రైతులు పంట సాగు చేయడం మానేశారు.

కట్టను కమ్మేసిన కంపచెట్లు

కట్టంగూర్ పెద్ద చెరువు కట్ట పొడవునా కంపచెట్లు కమ్మేశాయి. కట్టపై ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి అల్లుకుపోవడంతో రైతులు పంట పొలాల వద్దకు రాకపోకలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కంపచెట్లు తొలగించకపోవడంతో రైతులు పొలాల వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పెద్దచెరువు అలుగు పక్కనే ఉన్న తూము నుంచి ప్రవహించే కాలువ మొత్తం పూడిపోవడంతో పాటు కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో తూముకు మరమ్మతులు చేపట్టినా పంటపొలాలకు నీరు ప్రవహించే పరిస్థితి లేదు. కట్టకు ఆనుకుని ఉన్న కాలువకు మరమ్మతులు చేపట్టి కంపచెట్లను తొలగించి సక్రమంగా నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తూముకు మరమ్మతులు చేపట్టాలి



చెరువు తూము తలుపులు ధ్వంసం కావడంతో నీరంతా వృథా అయ్యి గత యాసంగిలో పంటసాగు నిలిపివేశాం. గత సంవత్సరం ఐబీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. సాగు కాలువ పూడికతోపాటు కంపచెట్లను తొలగించాలి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తూముకు మరమ్మతులు చేపట్టి నూతన తలుపులు ఏర్పాటు చేయాలి. –గట్టిగొర్ల యాదగిరి, రైతు కట్టంగూర్

త్వరలోనే మరమ్మతులు చేపడతాం

కట్టంగూర్ పెద్దచెరువు తూము గేటు తలుపులు శిథిలావస్థకు చేరడంతో నీరంతా వృథాగా పోయి రైతులు ఇబ్బందులకు గురైంది వాస్తవమే. కట్టపై పెరిగిన కంపచెట్లను తొలగించడంతోపాటు కాలువ పూడికతీత పనులు పూర్తిచేయిస్తాం. అలుగు పక్కనే ఉన్న తూముకు త్వరలో మరమ్మతులు చేపట్టి వానాకాలం పంటసాగుకు నీరందేలా చర్యలు తీసుకుంటాం. – రాజశేఖర్‌రెడ్డి, ఐబీ ఏఈ, కట్టంగూర్

డెంగీ వ్యాధి నివారణపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

నల్లగొండ టౌన్ : జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా గురువారం పానగల్‌లో డెంగీ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. కూలర్లు, పాత కుండలు, తొట్లు, మురుగునీటి గుంటల్లో నీరు నిల్వ ఉండకుండా పారబోయాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బైరగోని భిక్షం, సురేష్, ఏఎన్‌ఎం నర్సమ్మ, శిరీష, మంజుల అనురాధ, రేణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సంస్థాన్ నారాయణపురం: దొడ్డు రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.500లు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ నర్రి నర్సింహ మాట్లాడుతూ సన్న వరి ధాన్యానికే రూ.500బోనస్ ఇస్తాననడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీరాముల నరసింహ్మ, జక్కిడి యదిరెడ్డి, సిద్ధగొని శ్రీను, బోడ రాజు, తెలంగాణ బిక్షం, వీరమల్ల జంగయ్య, లక్ష్మారెడ్డి, బొడ్డుపల్లి గాలయ్య, సుర్వి యాదయ్య, పాండురంగనాయక్, నలపరాజు స్వామి, రమేష్, ఉప్పల శ్రీను, వడ్డేపల్లి రాములు, రాసాల వెంకటేష్, బొమ్మగోని రమేష్, చంద్రశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



పాల్గొన్న కార్యకర్తలు

నల్లగొండ టూటౌన్ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని వీటీ కాలనీలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక రెండుమార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచాడని, ఈ ఎన్నికల్లో కూడా రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికను కార్యకర్తలంతా సవాలుగా తీసుకుని ప్రతి గ్రాడ్యుయేట్ ఓటర్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, నారబోయిన భిక్షం, కంచనపల్లి రవీందర్‌రావు, కొండూరు సత్యనారాయణ, మాదగోని గణేశ్, వట్టిపల్లి శ్రీనివాస్, సయ్యద్, జాఫర్, లక్ష్మయ్య, తవిటి కృష్ణ పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం అండ్ రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించగా అసోసియేషన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా జాన్ సుందర్‌రాజు, అధ్యక్షుడిగా ఎంపీ శేషయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిద్యోన్, జనరల్ సెక్రటరీగా ప్రభుదాస్, ట్రెజరర్‌గా బాలస్వామి, రూరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉబ్బాని రవి, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఈఎస్ నాయక్, చీఫ్ సలహాదారులుగా ముండ్లగిరి కాంతయ్య, సంపత్, విజయరాణి, ఫిబాలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పాస్టర్లు ఆనంద్ పాల్, అబ్రహం, శంకర్‌నాయక్, సుధాకర్, ఏసు మణి, సైదానాయక్, యోహాన్, అనిల్, జాషువా, రాజేశ్వర్‌రావు తదితరులున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 28 పోలింగ్ కేంద్రాలు

మిర్యాలగూడ : ఈ నెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా 28 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాడ్గులపల్లి –2, వేములపల్లి–1, మిర్యాలగూడ –13, దామరచర్ల–2, అడవిదేవులపల్లి– 1, నిడమనూరు –2, త్రిపురారం –2, తిరుమలగిరి(సాగర్)–2, హాలియా –2, పెద్దవూర–2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15,768 మంది పురుష ఓటర్లు, 8,443 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. మొత్తం 24,211 ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికకు ఎన్నికల పరిశీలకులుగా రాహుల్ బొజ్జ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 27న నిర్వహించే పోలింగ్‌లో పట్టభద్రులందరూ పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే కాలనీలో గల శ్రీసాయి దత్తాశ్రమంలో గురువారం నాగసాయి విగ్రహ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝామున పంచామృతాభిషేకాలతో పాటు పలు రకాల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో 25కిలోల పూలతో సాయినాథుడిని అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోత్సవాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వైభవంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమయ్య, పందిరి సత్యనారాయణ, జగన్నాథరావు, జానకిరాముడు, రవి కిరణ్, విక్రం, వెంకన్న, అంజిబాబు, అరుణ, భాగ్యలక్ష్మి, పద్మ, కళ్యాణి, భవాని, శారద మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

మిర్యాలగూడ : ప్రభుత్వ అనుమతి లేకుండా చెరువులు, కుంటలు, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు గ్రామ శివారులో అక్రమార్కులు నిల్వ చేసిన సుమారు 8–10 డంప్‌ల ఇసుక(160 ట్రిప్పులు)ను జిల్లా మైనింగ్ ఏడీ జాకబ్‌తో కలిసి దాడులు చేసి సీజ్ చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించినా, డంప్ చేసినా వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. వారి వెంట తహసీల్దార్ హరిబాబు, రూరల్ ఎస్‌ఐ నరేష్, ఆర్‌ఐలు సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకు

- 30 ఏళ్ల కిందట నిర్మాణం
- పెచ్చులూడి చువ్వలు తేలిన పైకప్పు
- భయాందోళనలో చుట్టుపక్కల ప్రజలు





తుంగతుర్తిలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కేతేపల్లి: మండలంలోని తుంగతుర్తి గ్రామంలో దాదాపు 30 ఏళ్ల కిందట నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పైకప్పుతో పాటు, పిల్లర్లు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు తేలాయి. దీంతోపాటు ట్యాంకు పైకి వెళ్లేందుకు నిర్మించిన మెట్లు, తర్వాత ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెన శిథిలమయ్యాయి. నీటి సరఫరాను పరిశీలించేందుకు, ట్యాంకు శుభ్రపరిచేందుకు, బ్లీచింగ్ చేసేందుకు ట్యాంకుపైకి ఎక్కడానికి పంచాయతీ సిబ్బంది జంకుతున్నారు. ఈ ట్యాంకు నుంచే గ్రామంలో ఇంటింటికీ తాగునీటి సరఫరా అవుతోంది. ప్రధాన సీసీ రోడ్డుకు పక్కనే ఉన్న ఈ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ట్యాంకు పక్క నుంచి సమీప నివాస గృహాలవారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న పిల్లలు అక్కడ ఆటలు ఆడుతుంటారు. సంబంధిత అధికారులు సత్వరమే ట్యాంకును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

తుంగతుర్తి గ్రామంలో నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రజలకు తాగు నీటిని అందించేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో పాత ట్యాంకునే వినియోగిస్తున్నాం. నిధులు మంజూరు కాగానే నూతన ట్యాంకు నిర్మాణం చేపడతాం. –మౌనిక, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

నీరులేక వెలవెలబోతున్న చెరువులు



ఎండిపోయిన తిప్పర్తి మండలంలోని పజ్జూరు గ్రామ చెరువు

- జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు
- తగ్గిన భూగర్భ జలాలు
- ఆందోళనలో అన్నదాతలు

రామగిరి(నల్లగొండ): చెరువుల్లో రోజురోజుకూ నీటి మట్టం తగ్గిపోవడంతో జలకళను కోల్పోతున్నాయి. చెరువుల్లో నీటి మట్టం తగ్గుతున్న కొద్దీ చెరువుల కింద ఉన్న బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. తిప్పర్తి మండలంలో చెరువులు, కుంటలు 87 ఉన్నాయి. గతంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుతం మండల వ్యాప్తంగా చెరువులు ఎండిపోయి పూర్తిగా అడుగంటాయి. మే నెలలో చెరువుల్లో చుక్క నీరు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో చెరువుల కింద వ్యవసాయం కష్టతరం అయింది.

ఏళ్ల తర్వాత ఎండిన చెరువులు..

తిప్పర్తి మండల వ్యాప్తంగా 9 మేజర్ చెరువు ఉన్నాయి. పజ్జూరు, వెంకటాద్రిపాలెం ఎర్రగడ్డల గూడెం మధ్యలో ఉన్న నల్లచెరువు, గార్లచెరువు, గంగన్నపాలెంలో తిప్పర్తి వాగు ప్రాజెక్టు, మర్రిగూడెం సోమరాజు చెరువు, మామిడాల పెద్ద చెరువు, ఇండ్లూరు పెద్ద చెరువు, రామలింగాలగూడెం, కంకణాలపెల్లి శేషమ్మగూడెంలో ఆనెకట్టు ఉన్నాయి. ఒక్క శేషమ్మగూడెం ఆనెకట్టు, గంగన్నపాలెం చెరువులు మినహా దాదాపు మిగతా అన్ని చెరువులు పూర్తిగా అడుగంటిపోయాయి. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల తర్వాత చెరువులు ఎండిపోయాయని ఇరిగేషన్ అధికారుల అంచనా. కొన్ని ఏఎమ్మార్పీ కాలువపై ఆధారపడి ఉండగా మిగతావన్ని వర్షాధార చెరువులే. తిప్పర్తి మండలంలో చెరువుల కింద 4600 ఎకరాల ఆయకట్టు ఉందని అంచనా.

మత్స్యకారులకు ఉపాధి కరువు

తిప్పర్తి మండలంలో పజ్జూరు, ఇండ్లూరు, గంగన్నపాలెం, సోమరాజు చెరువు, రామలింగాలగూడెం, మామిడాల గ్రామాల్లోని చెరువుల్లో గతంలో మత్స్యకారులు చేప పిల్లలను వదిలి ఉపాధి పొందారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలతోపాటు మత్స్యకారులు సొంతంగా మరికొన్ని చేప పిల్లలను తీసుకొచ్చి చెరువులో వదిలి పెంచుకుని ఆదాయం పొందారు. కానీ ఇప్పుడు చెరువులు ఎండిపోవడంతో జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధి కోల్పోయింది

తిప్పర్తి మండలంలో చెరువులు ఎండిపోవడంతో మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయింది. మండలంలో దాదాపు 8 మత్స్యకారుల సొసైటీలు ఉన్నాయి. చాలా ఏళ్ల తరువాత మండలంలో చెరువులు ఎండిపోయాయి. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

–చెక్కల లింగయ్య, పజ్జూరు మత్స్యకారుల సొసైటీ చైర్మన్

వేసవి సెలవులు సద్వినియోగమయ్యేలా..

- గుండ్రాంపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ
- రేపటితో ముగియనున్న శిబిరం
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు



చిత్రలేఖనంలో సూచనలు ఇస్తున్న ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్



చిన్నారులకు చేతిరాతపై సూచనలు ఇస్తున్న గూడురు మహేందర్‌రెడ్డి



గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థి

చిట్యాల: సాధారణంగా వేసవి సెలవులు వస్తే విద్యార్థులు ఆటలు ఆడుతూ, బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళుతూ గడుపుతుంటారు. అలా కాకుండా తమ గ్రామంలోని విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఉండేందుకు పలు అంశాల్లో నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన యువకుడు అనుముల శ్రీనివాస్.

గ్రామస్తుల సహకారంతో..

గుండ్రాంపల్లి గ్రామంలో పదహారేళ్ల క్రితం ఆ గ్రామానికి చెందిన అనుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొంతమంది యువకులు తమ సొంత ఖర్చులు, గ్రామస్తుల సహకారంతో గ్రంథాలయ సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి గ్రంథాలయం ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. కాగా వేసవి కాలంలో విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయడాన్ని గమనించిన గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ వారి కోసం పలు అంశాల్లో గత ఏడాది నుంచి వేసవి కాలంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. గత ఏడాది శిక్షణ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ ఏడాది వేసవి కాలంలో ఏప్రిల్ 26వ తేదీ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పలు అంశాల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రముఖులతో శిక్షణ..

పుస్తక పఠనంతోపాటు చెస్, క్యారం బోర్డు, డ్రాయింగ్, పిల్లలు కథలు చెప్పడం, నేర్చుకోవడం వంటి అంశాలను ఈ శిక్షణలో నేర్పిస్తున్నారు. కథా రచయిత కె.రవి, చేతి రాత నిపుణుడు గూడురు మహేందర్‌రెడ్డిలతో శిక్షణ ఇప్పిస్తున్నారు. పెయింటింగ్‌లో ప్రముఖ చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్, తెలుగు భాషపై కూరెళ్ల నర్సింహాచారి వంటివారితో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 90 మందికిపైగా చిన్నారులు ఈ ఉచిత శిక్షణ శిబిరానికి వచ్చి పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ఈ శిబిరానికి గ్రామానికి చెందిన పలువురు సహకరించడంతోపాటు పాల్గొన్న చిన్నారులకు స్నాక్స్ అందజేశారు. కాగా వేసవి శిక్షణ శిబిరం ఈ నెల 18వ తేదీతో ముగియనుంది. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడంపై చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలు అంశాలను నేర్చుకున్నా



మా గ్రామంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరానికి రోజూ వెళ్లాను. ఆ శిబిరంలో చిత్రలేఖనం, అందమైన చేతి రాత రాయడం, కథలు రాయడం, చెప్పడంతోపాటు, తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ వంటి అంశాల్లో బేసిక్స్, చెస్, క్యారం నేర్చుకున్నాం. ఈ శిక్షణ మాకు ఎంతగానో ఉపయోగపడింది. ఈ శిబిరం ప్రతి వేసవిలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–అచ్చిని మహిత విద్యార్థిని, గుండ్రాంపల్లి

శిక్షణ శిబిరాలను కొనసాగిస్తాం



వేసవిలో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా ఉండేందుకు ఉచితంగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేశాం. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనంతోపాటు పలు క్రీడల్లో శిక్షణ ఇచ్చాం. గ్రామస్తులు, గ్రంథాలయ పాలకవర్గ సభ్యుల సహకారంతో ఉచిత శిక్షణ శిబిరాలను కొనసాగిస్తాం.

–అనుముల శ్రీనివాస్, గ్రంథాలయ అధ్యక్షుడు, గుండ్రాంపల్లి